ప్రజారోగ్యం పట్టదా?


ప్రారంభానికి నోచుకోని ఆర్పీపేట పట్టణ ఆరోగ్య కేంద్ర అదనపు భవనం

నాడు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ప్రజారోగ్యానికి పెద్దపీట వేసింది. ప్రజలకు చేరువలో పట్టణ ఆరోగ్య కేంద్రాలు నిర్మించింది. అవసరమైన వైద్య సిబ్బందిని నియమించింది. మందులతో పాటు వైద్య పరీక్షలను అందుబాటులోకి తెచ్చింది. స్పెషలిస్టుల వైద్య సేవలను చేరువ చేసింది.దీంతో ఏ చిన్న అనారోగ్య సమస్య తలెత్తినా ప్రజలు పట్టణ ఆరోగ్య కేంద్రాలకు వెళ్లి వైద్యం చేయించుకునేవారు.

నేడు కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత ప్రజారోగ్యాన్ని నిర్లక్ష్యం చేస్తోంది. పట్టణ ఆరోగ్య కేంద్రాలను నిర్వీర్యం చేస్తోంది. స్పెషలిస్టు వైద్య సేవలకు మంగళం పాడింది. వైద్య పరీక్షల సంఖ్య తగ్గిపోయింది. మందులు కూడా అరకొరగానే లభిస్తున్నాయి. ఆఖరికి గత ప్రభుత్వం లక్షలు ఖర్చు చేసి నిర్మించిన భవనాలను కూడా వినియోగంలోకి తేకుండా కాలయాపన చేస్తోంది. ఫలితంగా పేద ప్రజలకు వైద్యం భారమవుతోంది.

- ప్రారంభానికి నోచుకోని అదనపు భవనం
- ఇరుకు గదుల్లోనే అన్ని సేవలు
- నిరుపయోగంగా అదనపు గదులు
- ప్రారంభించాలని రోగుల మొర


ఒకే గదిలో ఓపీ, మందులు ఇచ్చే విభాగం

కంచరపాలెం: జీవీఎంసీ 56వ వార్డు కంచరపాలెం దరి రామ్మూర్తిపంతులుపేట పట్టణ ఆరోగ్య కేంద్రంలో వసతులు లేక రోగులు ఇబ్బందులు పడుతున్నారు. ఇరుకు గదుల్లోనే వైద్య సేవలు అందిస్తున్నారు. నిత్యం ఔట్ పేషెంట్ విభాగంలో సుమారు 90 నుంచి 110 మంది వస్తుంటారు. ఈ రద్దీని దృష్టిలో పెట్టుకుని గత ప్రభుత్వం అదనపు భవనం నిర్మించింది. దాన్ని ప్రారంభించక పోవడంతో అటు రోగులు, ఇటు వైద్య సిబ్బంది, ఇబ్బందులు పడుతున్నారు.

ఇదీ పరిస్థితి

ఆర్పీపేట యూపీహెచ్‌సీలో అదనపు భవనం వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం నిర్మించింది. ప్రారంభించే సమయానికి ఎన్నికల కోడ్ కూయడంతో బ్రేక్ పడింది. కూటమి ప్రభుత్వం వచ్చి ఆర్నెల్లు గడిచినా నేటికీ అదనపు భవనం ప్రారంభించకపోవడంతో రోగులు నానా ఇబ్బందులు పడుతున్నారు. ఇరుకు గదిలో పరీక్షలు, ఓపీ, మందులు ఇవ్వడంతో ఇబ్బందులు పడుతున్నారు. రోగుల బంధువులతో పాటు వైద్య సిబ్బంది కూడా కొత్త రోగాలతో ఇళ్లకు వెళ్లే పరిస్థితి కనిపిస్తోంది.


ఇరుకు గదిలోనే రోగులు.. వైద్యపరీక్షల కోసం నిరీక్షణ


నూతనంగా నిర్మించిన టాయిలెట్లు


నూతన భవనంలో ఏర్పాటుచేసిన బెడ్లు

నిధులు నిరుపయోగం

ఆర్పీపేట పట్టణ ఆరోగ్య కేంద్రం(డిస్పెన్సరీ) పుష్కర కాలం కిందట నిర్మించారు. పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా నాటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వైఎస్సార్ ప్రజా ఆరోగ్య కేంద్రం అదనపు భవన నిర్మాణానికి సుమారు రూ.47లక్షలు నిధులు మంజూరు చేశారు. భవనానికి శంకుస్థాపన చేసిన ఏడాదిలోనే నిర్మాణం పూర్తి చేశారు. అయితే అదనపు భవనం ప్రారంభించే సమయానికి సార్వత్రిక ఎన్నికల కోడ్ కూసింది.

అధికారుల సమన్వయలోపమే శాపం

నూతన భవనాన్ని ప్రారంభించాలని రోగులు, వైద్యసిబ్బంది మొర పెట్టుకున్నా ప్రయోజనం కనిపించడం లేదు. పాలకులు కూడా దృష్టిపెట్టడం లేదని స్థానికులు వాపోతున్నారు. జోన్–5 ఇంజినీరింగ్ అధికారి టి.ప్రసన్నకుమారిని వివరణ కోరగా డీఎంహెచ్‌వో అధికారులకు అదనం భవనం అప్పజెప్పామన్నారు. వారి నిర్ణయం మేరకు భవన ప్రారంభోత్సవం ఉంటుందని తెలిపారు.

అన్నీ ఇబ్బందులే..



ఇరుకు గదుల్లోనే వైద్యసిబ్బంది రోగులకు సేవలు అందిస్తున్నారు. అదనపు భవనం నిర్మించి ఏడాది గడుస్తున్నా ప్రారంభించకపోవడంతో రోగాలతో వైద్యానికి వచ్చే వారు కొత్త రోగాలు అంటించుకునే పరిస్థితి కనిపిస్తుంది. రక్త పరీక్షలు, మందులు ఇచ్చేగది, ఓపీ నమోదు అన్ని ఒకే చోట ఉండడంతో ఇబ్బందిగా మారుతుంది. మళ్లీ ఎలాంటి వ్యాధులు అంటుతాయోనని ఆందోళనగా ఉంటుంది.

– సూరిబాబు, గాంధీనగర్, కంచరపాలెం

అధికారులు స్పందించాలి

గత ప్రభుత్వం ప్రజల కోసం నిధులు వెచ్చించి అదనపు భవనం నిర్మాణం చేపట్టింది. ఆ భవనం ప్రారంభిస్తే రోగులకు ఇబ్బంది లేకుండా వైద్య సేవలు అందుతాయి. కొత్త ప్రభుత్వం వచ్చినా ఇప్పటి వరకూ అదనపు భవనం ప్రారంభించకపోవడం దారుణం, ప్రజాప్రతినిధులు రోగుల కోసం ఆలోచించి భవనం ప్రారంభించేలా చూడాలి. దీనికి సంబంధించిన అధికారులు స్పందించాలి.



– ఎం.రాజ్యం, గొల్లకంచరపాలెం.

క్లుప్తంగా

61వ వార్డులో రెవెన్యూ సదస్సు నిర్వహణ


ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరిస్తున్న ఎమ్మెల్యే గణబాబు

మల్కాపురం: జీవీఎంసీ 61వ వార్డు మల్కాపురం మరిడిమాంబ కల్యాణమండపం వద్ద మంగళవారం రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఎమ్మెల్యే పి.గణబాబు,ములగాడ తహసీల్దార్ భుజంగరావు, జోన్–5 జెడ్సీ రాము తదితర ఉన్నతాధికారులు కార్యక్రమంలో పాల్గొని వినతులు స్వీకరించారు. పట్టాలు లేని వారు, పట్టాలు ఉన్నా రిజిస్ట్రేషన్ కాని వారు సుమారు 40 మంది వినతులు అందించారు. కార్యక్రమంలో 63వ వార్డు కార్పొరేటర్ గల్లా చిన్న, జనసేన నాయకురాలు అంగ దుర్గాప్రశాంతితో పాటు స్థానిక నాయకులు పాల్గొన్నారు.

రోగులకు పండ్లు పంపిణీ


ఆస్పత్రిలో రోగికి పండ్లు అందిస్తున్న రాజేశ్వరి

మల్కాపురం: గ్లోబల్ హ్యూమన్ రైట్స్ ఎవేర్నెస్ అసోసియేషన్ (జీహెచ్‌ఆర్‌ఏఏ) విశాఖ జిల్లా పశ్చిమ నియోజకవర్గ మహిళా విభాగం చైర్మన్ ఆకుల లోవ రాజేశ్వరి ఆధ్వర్యంలో పారిశ్రామిక ప్రాంత పరిధిలోని పలు ఆస్పత్రులలో రోగులకు మంగళవారం పండ్లు పంపిణీ చేశారు. తొలుత గుల్లలపాలెంలోని ఎఫ్‌ఆర్‌యూ ఆస్పత్రి వద్ద రోగులకు వీటిని అందించారు. ఆమె మాట్లాడుతూ మానవ హక్కుల దినోత్సవం సందర్భంగా రోగులకు పండ్లు, బిస్కెట్లు పంపిణీ చేసినట్లు చెప్పారు. కార్యక్రమంలో జీహెచ్‌ఆర్‌ఏఏ ప్రతినిధులు, సభ్యులు పాల్గొన్నారు.

ఘనంగా నూకాలమ్మతల్లి పండగ

మల్కాపురం: జీవీఎంసీ 58వ వార్డు కోడిపందాలదిబ్బ గ్రామదేవత నూకాలమ్మతల్లి పండగను మంగళవారం ఘనంగా నిర్వహించారు. పసుపు కుంకుమలు,చీరలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. అమ్మవారిని ఎమ్మెల్యే పి.గణబాబు దర్శించుకుని పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామదేవతలను నిత్యం ఆరాధించడం వల్ల అంతా క్షేమంగా ఉంటారన్నారు. స్థానిక నాయకుడు పోతాబత్తుల శ్రీను తదితరులు పాల్గొన్నారు.

సక్రమమైన విద్యా విధానంతోనే సమాజ అభ్యున్నతి


చిన జీయర్ స్వామి

సీతమ్మధార: సమాజం అభ్యున్నతి సాధించాలంటే సక్రమమైన విద్యా విధానం అమలులో ఉండాలని త్రిదండి చిన జీయర్ స్వామి తెలిపారు. సీతమ్మధారలో జరుగుతున్న గీతా జయంతి వేడుకల్లో నాల్గవ రోజు మంగళవారం ఆరాధన అనంతరం ఆయన అనుగ్రహ భాషణం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రపంచంలోని వస్తువులన్నీ మంచివేనని, వాటి వినియోగం ద్వారా ఆ వస్తువు స్థితి మారుతుందని చెప్పారు. భగవంతుడు మనకి ఇచ్చిన వస్తువులను సక్రమంగా వినియోగించే సాధనమే విద్య అని అన్నారు. సమాజం ఎలా ఉండాలో క్రమం తెలియ చేసే విద్య వేదవిద్య అని చెప్పారు. వేద విద్యలో కనీస అవగాహన కలగడానికి కనీసం 12 సంవత్సరాల సమయం పడుతుందని, తదుపరి సాధన, అధ్యయనం చేయడానికి మరో 8 ఏళ్లు పడుతుందన్నారు. నేర్చుకున్న వేద విద్యను సమాజానికి ఉపయోగించడానికి కృషి చేసేందుకే వేద పాఠశాలలు, ఆధ్యాత్మిక సంస్థలు ఉన్నాయన్నారు. వేద పఠనం ద్వారా ఆ వాక్కులు తరంగాలుగా సమాజంలోని వివిధ ప్రాంతాలకు చేరతాయని తెలిపారు.

ఎన్‌ఏడీ కార్మికుల పోరాటానికి సంఘీభావం


నిరసన చేపట్టిన నాయకులు, కార్మికులు

గోపాలపట్నం: ఎన్‌ఏడీ కార్మికుల పోరాటానికి స్థానిక యూనియన్లు సంఘీభావం ప్రకటించాయి. ఆరుగురిపై కోర్టు కేసు పెట్టి, 36 మంది నాయకులను, కార్మికులను ఎన్‌ఏడీ యాజమాన్యం సస్పెండ్ చేయడాన్ని ఖండిస్తూ విశాఖ రక్షణ రంగంలో ఉన్న అన్ని యూనియన్లు, అసోసియేషన్లు నిరసన కార్యక్రమాలు చేపట్టాయి. అందులో భాగంగా మంగళవారం నావెల్ డాక్‌యార్డ్, ఎన్‌ఏడీ గేట్ల వద్ద నిరసనలు చేపట్టారు. నాయకులు, కార్మికులపై జరుగుతున్న దాడులకు వ్యతిరేకంగా ఈ నెల 12న దేశవ్యాప్తంగా ఉన్న రక్షణ రంగసంస్థల ఎదుట నిరసనలు చేపట్టాలని ఆలిండియా డిఫెన్స్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ పిలుపునిచ్చినట్లు ఎన్‌ఏడీ యూనియన్ ప్రధాన కార్యదర్శి గుప్తల శ్రీనివాస్ తెలిపారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు, కార్మికులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

పోరాటంతోనే విశాఖ ఉక్కును కాపాడుకుంటాం


దీక్షా శిబిరంలో పాల్గొన్న సీఐటీయూ నాయకులు

సీతమ్మధార: విశాఖ స్టీల్ ప్లాంట్ రక్షణ కోసం జరుగుతున్న నిరాహార దీక్షలు మంగళవారం 1316వ రోజుకు చేరుకున్నాయి. సీఐటీయూ మధురవాడ జోన్ కమిటీ నాయకులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా పార్టీ జోన్ ప్రధాన కార్యదర్శి పి. రాజుకుమార్ మాట్లాడుతూ విశాఖ ఉక్కును ప్రైవేటీకరం చేయడం కోసం కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం చేస్తున్న కుట్రలను స్టీల్ కార్మికులు, ప్రజా సంఘాల ఐక్య వేదిక ప్రతిఘటిస్తున్నట్లు తెలిపారు. విశాఖ ఉక్కును రక్షించుకునే పోరాటంలో ప్రజలు కూడా భాగస్వాములవుతున్నారని తెలిపారు. రాష్ట్రంలో అధికారం చేపట్టిన కూటమి ప్రభుత్వం ప్లాంట్ రక్షణకు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అలా కాకుండా బీజేపీ ఒత్తిడికి లొంగిపోతే ప్రజా వ్యతిరేకతను ఎదుర్కోక తప్పదని హెచ్చరించారు. ఈ దీక్షల్లో సీఐటీయూ కార్యకర్తలు డి.అప్పలరాజు, జి. చిన్నారావ్, ఎస్. శ్రీనివాసరావు, ఎం.రాజు, జె. ఆర్యులు, ఎస్. సూరప్పాడు, సన్ మూర్తి తదితరులు పాల్గొన్నారు.

కట్టమంచి ఆలోచనలకు ప్రతిరూపం ఏయూ

- వైస్ చాన్సలర్ శశిభూషణరావు
- ఘనంగా కట్టమంచి రామలింగారెడ్డి జయంతి


స్నాతకోత్సవ హాల్ వద్ద కట్టమంచి విగ్రహానికి పూలమాలలు వేస్తున్న వీసీ, రిజిస్ట్రార్

విశాఖ విద్య: కట్టమంచి రామలింగా రెడ్డి ఆలోచనలకు ప్రతిరూపంగా ఆంధ్ర విశ్వవిద్యాలయం నిలుస్తుందని వైస్ ఛాన్సలర్ ఆచార్య జి.శశిభూషణ రావు తెలిపారు. ఆంధ్ర విశ్వవిద్యాలయ వ్యవస్థాపక ఉపకులపతి కట్టమంచి రామలింగా రెడ్డి జయంతిని మంగళవారం విశ్వవిద్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ముందుగా ఆంధ్ర విశ్వవిద్యాలయ ప్రధాన పరిపాలన భవనం వద్ద ఉన్న రామలింగా రెడ్డి విగ్రహానికి ఉపకులపతి ఆచార్య జి.శశిభూషణరావు, రెక్టార్ ఆచార్య ఎన్.కిషోర్ బాబు, రిజిస్ట్రార్ ఆచార్య ఇ.ఎన్.ధనుంజయరావు పూలమాలలు వేసి అంజలి ఘటించారు. అదేవిధంగా స్నాతకోత్సవ మందిరం వద్ద ఉన్న కట్టమంచి రామలింగా రెడ్డి విగ్రహానికి సైతం పూలమాల వేసి నివాళి అర్పించారు.ఈ సందర్భంగా వైస్ ఛాన్సలర్ ఆచార్య జి.శశిభూషణ రావు మాట్లాడుతూ విశ్వవిద్యాలయ ఏర్పాటు సమయంలో రామలింగా రెడ్డికి అనేక సవాళ్లు ఎదురయ్యాయని వాటిని ఆయన విజయవంతంగా ఎదుర్కొని ఒక గొప్ప ఆశయసాధకునిగా నిలిచారన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఆచార్య ఎ.నరసింహారావు, ఎం.వి.ఆర్ రాజు, కె.సీతామాణిక్యం, డి.నాగరాజ కుమారి, డాక్టర్ పద్మశ్రీ, అకడమిక్ డీన్ కె.ఈశ్వర్ కుమార్, దూర విద్యా సంచాలకులు ఆచార్య ఎస్. విజయమోహన్, ఆచార్య డి.ఏ నాయుడు, డాక్టర్ మూర్తి, ఆచార్య విశ్వనాథం, ఆచార్య ప్రేమానందం, ఆచార్య పల్లవి ఆచార్య ఏకేఎం పవార్, ఆచార్య అరుణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా కట్టమంచి జయంతి

విశాఖ విద్య: ఏయూ తెలుగు శాఖ ఆధ్వర్యంలో కట్టమంచి రామలింగారెడ్డి జయంతిని మంగళవారం ఘనంగా నిర్వహించారు. విభాగాధిపతి ఆచార్య జర్రా అప్పారావు ఈసందర్భంగా రామలింగారెడ్డి చిత్ర పటానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం ఆయన మట్లాడుతూ విజ్ఞానమే ప్రధానంగా విశ్వవిద్యాలయం నడిపిన ఘనత కట్టమంచి రామలింగారెడ్డికి దక్కుతుందన్నారు. ఆచార్య ఎ.నరసింహారావు, విశ్రాంత అధ్యాపకుడు డి.వి. సూర్య తదితరులు ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ ఈశ్వరమ్మ, డాక్టర్ లావణ్య, డాక్టర్ వెంకటస్వామి, డాక్టర్ రత్న శేఖర్, డాక్టర్ వెంకటేశ్వర్లు,డాక్టర్ సీతారత్నం, డాక్టర్ గిరీష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

అంతా గత వైభవమే!

40వ వార్డులో రోడ్లు చూసి ప్రజల చర్చ


షిప్‌యార్డ్‌కాలనీలో నిర్మించిన నూతన రోడ్డు


40వ వార్డులో సుందరంగారోడ్లు


వాంబే కాలనీ గృహ సముదాయం వద్ద సుందరంగా రోడ్డు

సింధియా: జీవీఎంసీ 40వ వార్డులో ఎక్కడ చూసినా సిమెంట్, తారురోడ్లు అద్దంలా దర్శనమిస్తున్నాయి. దీంతో ఎలాంటి అంతరాయం లేకుండా రోడ్లపై ప్రజలు, వాహనచోదకులు హాయిగా ప్రయాణం సాగిస్తున్నారు. ఇది అంతా గత వైఎస్సార్‌సీపీ హయాంలో చేసిన అభివృద్ధే అని ప్రజలు ఇప్పుడు చర్చించుకుంటున్నారు.

ఇదీ పరిస్థితి...

40వ వార్డులో రోడ్లు గుంతలతో పిక్క తేలి అధ్వానంగా ఉండేవి. పలు చోట్ల కేబుల్ వైర్లు, ఇంటర్‌నెట్ కోసం తవ్విన గోతులు సరిగ్గా పూడ్చకపోవడంతో రాకపోకలకు ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడేవారు. సమస్యను తెలుసుకున్న వార్డు కార్పొరేటర్ నాగేశ్వరరావు చొరవ తీసుకుని రోడ్ల దుస్థితిని గత ప్రభుత్వ హయాంలో అధికారులతో చర్చించి నిధులు మంజూరు చేయించి పనులు పూర్తి చేశారు.

40వ వార్డులో పలు అభివృద్ధి పనులకు వెచ్చించిన నిధులు

జీవీఎంసి 40వ వార్డులోగత ప్రభుత్వ హయాంలో యువత కోసం రూ. 36 లక్షలతో జిమ్ ఏర్పాటు చేశారు. రూ. 18 లక్షలతో రాజీవ్ గృహాలకు మరమ్మతులు, రూ. 80 లక్షలతో వాంబే గృహాల మరమ్మతులు చేపట్టారు.

- ఏకేసీకాలనీలో రూ.12 లక్షలతో సీసీ రోడ్లు, సీసీ డ్రైయిన్లు
- షిప్‌యార్డ్‌కాలనీలోని పాత శివాలయం వరకు రూ.39 లక్షలతో నూతన రోడ్లు నిర్మించారు. అదే విధంగా వార్డులోని పలు ప్రాంతాల్లో రోడ్ల మరమ్మతులు చేపట్టడంతో పాటు డ్రైయిన్లు, కల్వర్టులు నిర్మించడంతో భవిష్యత్తులో ఎటువంటి ఇబ్బందులు తలెత్తవని ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

జాబ్‌మేళాలో 35 మందికి ఉద్యోగాలు


డబ్ల్యుఎన్ఎస్ కంపెనీకి ఎంపికైన అభ్యర్థులు

మురళీనగర్: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో కంచరపాలెం ప్రభుత్వ పాలిటెక్నిక్ కాలేజీలో మంగళవారం నిర్వహించిన జాబ్ మేళాకు విశేష స్పందన లభించింది. ఈ జాబ్ మేళాలో డబ్ల్యుఎన్ఎస్, అడ్‌హక్ నెట్‌వర్క్స్, ఐస్మార్ట్ సొల్యూషన్స్ కంపెనీలు పాల్గొని ఉద్యోగాల నియామకానికి సంబంధించి ఇంటర్వ్యూలు నిర్వహించాయి. పాలిటెక్నిక్ కాలేజీ ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ కేడీవీ నరసింహారావు, జిల్లా ఉపాధి కల్పనాధికారి(క్లరికల్) సీహెచ్ సుబ్బిరెడ్డి, జిల్లా నైపుణ్యాధికారి టి.చాముండేశ్వరావు పర్యవేక్షణలో నిర్వహించిన ఈ జాబ్ మేళాకు 178 మంది యువతీ యువకులు హాజరయ్యారు. వీరిలో 35 మంది ఉద్యోగాలకు ఎంపిక కాగా అడ్‌హక్ నెట్‌వర్క్ కంపెనీ 15 మందిని ఫైనల్ రౌండుకు ఎంపిక చేసింది. ఈ రౌండుకు ఎంపికైన వారిలో అర్హులను రెండు రోజుల్లో ఉద్యోగాలకు ఎంపిక చేస్తారు. ఈ కార్యక్రమంలో స్కిల్ హబ్ కో–ఆర్డినేటర్ టి.లక్ష్మి, కె.సంతోష్ కుమార్, ప్లేస్‌మెంట్ ఎగ్జిక్యూటివ్ రమేష్ నాయుడు పాల్గొని అవసరమైన ఏర్పాట్లు చేశారు.

కనకమహాలక్ష్మికి విశేష పూజలు


విశేష పూజలో కనకమహాలక్ష్మి

దాబాగార్డెన్స్: మార్గశిర మాసోత్సవాలు 9వ రోజు మంగళవారం అమ్మవారి ఆలయం భక్తులతో కిటకిటలాడింది. అమ్మవారిని అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకుని విశేష పూజలు జరిపారు. ఉదయం 5 నుంచి 6 గంటల వరకు పంచామృతాభిషేకం, అమ్మవారికి సహస్రనామార్చన, 6 నుంచి 11 గంటల వరకు సర్వదర్శనం, 11.30 నుంచి 12 గంటల వరకు అమ్మవారికి పంచామృతాభిషేకాలు నిర్వహించారు. మధ్యాహ్నం 12 గంటల నుంచి సాయంత్రం 5.30 వరకు సర్వదర్శనం, 6 నుంచి రాత్రి 7 గంటల వరకు విశేష పంచామృతాభిషేకం, అష్టోత్తర నామార్చన పూజ జరిపారు. అష్టదళ పద్మారాధనలో, త్రికాల పంచామృతాభిషేక సేవలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. ఈ పూజలో పాల్గొనదలిచే ఆసక్తి గల భక్తులు మార్గశిర గురువారాల్లో రూ.7,500, గురువారం మినహా మిగిలిన రోజుల్లో రూ.2,500 చెల్లించి పూజలో పాల్గొనవచ్చని ఈవో శోభారాణి తెలిపారు.

మండపంలో వైదిక కార్యక్రమాలు..

ఉదయం 8 నుంచి 10 గంటల వరకు శ్రీచక్రనవావర్ణార్చన, లక్ష్మీహోమం, మార్గశిర మాస విశేష కుంకుమార్చన, అష్టోత్తర కుంకుమార్చనలు, వేదపారాయణ, సప్తశతీ పారాయణ, మహా విద్యాపారాయణ భక్తిశ్రద్ధలతో జరిపారు. ఉదయం 6 నుంచి రాత్రి 9 గంటల వరకు మార్గశిర మాస విశేష కుంకుమార్చనలు చేశారు. మధ్యాహ్నం వందలాది మంది భక్తులకు అన్నసమారాధన ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఆలయ ఏఈవో కె. తిరుమలేశ్వరరావు, వేదపండితులు పాల్గొన్నారు.

మానవ హక్కుల పరిరక్షణ అందరి బాధ్యత

ఏయూ లా కాలేజీ ప్రిన్సిపాల్ సీతామాణిక్యం


వేడుకల్లో విద్యార్థులతో కలసి పాల్గొన్న ప్రిన్సిపాల్ ఆచార్య సీతామాణిక్యం

విశాఖ విద్య: మానవ హక్కుల పరిరక్షణ అందరి బాధ్యత అని ఏయూ లా కాలేజీ ప్రిన్సిపాల్ ఆచార్య కె.సీతామాణిక్యం అన్నారు. అంతర్జాతీయ మానవ హక్కుల దినోత్సవాన్ని మంగళవారం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ లా కాలేజీ సెమినార్ హాల్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా న్యాయవిద్యార్థులకు క్విజ్‌పోటీలు నిర్వహించారు.ఈ కార్యక్రమంలో ఇటీవల జూనియర్‌సివిల్‌జడ్జిగా ఎంపికైన లా కాలేజీ పూర్వ విద్యార్థిని గీతాభార్గవి పాల్గొన్నారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కాలేజ్ ఆఫ్ లా ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ కె.సీతామాణిక్యం మాట్లాడు తూ మానవ హక్కుల దినోత్సవాన్ని అంతర్జాతీయ సమాజం ప్రతి సంవత్సరం డిసెంబర్ 10న జరుపుకొంటుందన్నారు. 1948లో ఐక్య రాజ్యసమితి జనరల్ అసెంబ్లీ మానవ హక్కుల సార్వత్రిక ప్రకటనను ఆమోదించిన రోజును గుర్తుచేసుకుందని ఆమె చెప్పారు.

హక్కుల సాధనకు కృషి చేయాలి

అంతర్జాతీయ మానవ హక్కుల దినోత్సవం సందర్భంగా డిపార్ట్‌మెంట్ ఆఫ్ హ్యూమన్ రైట్స్ పూర్వ విద్యార్థులు, పీపుల్స్ లిబరేషన్ వెల్ఫేర్ సొసైటీ, హెచ్‌ఆర్‌డీ, విభాగం, డీడీసీడబ్ల్యూఎస్ సంయుక్త ఆధ్వర్యంలో మంగళవారం జర్నలిజం విభాగంలో సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ నరసింహారావు, సోషల్ వర్క్ విభాగాధిపతి ప్రొఫెసర్ హరనాథ్, సోషల్ ఇంక్లూసివ్ సెంటర్ డైరెక్టర్ ప్రొఫెసర్ సుబ్బారావు, డీడీసీడబ్ల్యూఎస్ డైరెక్టర్ ప్రొఫెసర్ పల్లవి,మాట్లాడుతూ హక్కుల సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు.కార్యక్రమంలో డాక్టర్ రవి రత్న ప్రకాష్, డాక్టర్ ఉష, అసిస్టెంట్ ప్రొఫెసర్ టి.సాంబశివరావు, కె.రవికుమార్, బీజీ కిరణ్ తదితరులు పాల్గొన్నారు.